క్లుప్తంగా

తూకంలో తేడాలపై 11 కేసులు నమోదు



నెహ్రూనగర్: తూకంలో తేడాలు వస్తే సహించేది లేదని, మోసాలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ జి. కొండారెడ్డి తెలిపారు. డెప్యూటీ కంట్రోలర్ షాలేంరాజు ఆదేశాల మేరకు ఆదివారం జేకేసీ కాలేజీ రోడ్డులోని చేపల, చికెన్, మటన్ షాపుల్లో తనిఖీలు చేపట్టారు. మొత్తం 20 షాపుల్లో తనిఖీలు చేపట్టగా 11 షాపుల్లో తూకంలో కేజీకి 200 నుంచి 400 గ్రాముల వరకు తేడాలున్నట్లు గమనించారు. సదరు కాటాలను సీజ్ చేసి వారిపై కేసులు నమోదు చేశారు. తూకంలో తేడాలున్నట్లు వినియోగదారులు గమనిస్తే 0863-2223202 నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. తనిఖీల్లో ఇన్‌స్పెక్టర్ సునీల్ రాజు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ



నెహ్రూనగర్: పేద ప్రజల ఆరోగ్యానికి సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి కొండంత భరోసా కల్పిస్తున్నారని 30వ డివిజన్ కార్పొరేటర్ అచ్చాల వెంకటరెడ్డి పేర్కొన్నారు. ఆరోగ్య శ్రీ పథకం కింద రూ.25 లక్షలు వరకు వైద్య ఖర్చును భరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన ఆరోగ్య శ్రీ కార్డులను డివిజన్ పరిధిలో ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.5లక్షల పరిమితి ఉన్న ఆరోగ్యశ్రీ కార్డును రూ.25లక్షలు వరకు పెంచుతూ సీఎం వైఎస్. జగన్ మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయంపై హర్షం వ్యక్తం చేశారు. ప్రతి పేదవాడికీ కార్పొరేట్ ఆసుపత్రిల్లో సైతం మెరుగైన వైద్యం లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ లక్ష్మణస్వామి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు నగరపాలక సంస్థలో 'స్పందన'

నెహ్రూనగర్: స్థానిక సమస్యలపై అర్జీలు స్వీకరించే స్పందన కార్యక్రమం సోమవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్లో జరుగుతుందని కమిషనర్ కీర్తి చేకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సచివాలయాల్లో ప్రతి రోజు మధ్యహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు స్పందన ఉంటుందని, స్థానికంగా పరిష్కారం కాని సమస్యలపై తమకు నేరుగా అర్జీలు అందజేయవచ్చని ఆమె సూచించారు.

26న యూత్ రిట్రీట్

నెహ్రూనగర్: తెలుగు బాప్టిస్ట్ సంఘం ఆధ్వర్యంలో 26న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు యూత్ రిట్రీట్ (యవ్వనస్తుల కూడిక) నిర్వహించనున్నట్లు సెక్రటరీ వై. సోమయ్య, యూత్ డైరెక్టర్ బి. ప్రతాప్ ఆదివారం తెలిపారు. కన్నావారితోట మూడు బొమ్మల సెంటర్ వద్ద గల చర్చిలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా చర్చిలో యువతకు యోహాను సువార్త మీద గ్రూప్ క్విజ్, నెహెమ్యా గ్రంథం మీద వ్యక్తిగత బైబిల్ పరీక్ష, పాటల పోటీ నిర్వహించనున్నట్లు తెలిపారు. విజేతలకు బహుమతుల ప్రదానం ఉంటుందన్నారు. ముఖ్య ప్రసంగీకులుగా కావలికి చెందిన కల్వరీ తెలుగు బాప్టిస్ట్ చర్చి నుంచి బ్రదర్ సీహెచ్. జీవన్ హాజరవుతారని తెలిపారు. యువత హాజరై జయప్రదం చేయాలని వారు కోరారు.

ఉత్సాహంగా దేశభక్తి గీతాల పోటీలు

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం శ్రీ పద్మావతి కల్యాణ మండపం వేదికగా ఆదివారం సంస్కార భారతి అధ్యక్షుడు ఇండ్ల శ్రీధరబాబు ఆధ్వర్యంలో రిపబ్లిక్ డే పురస్కరించుకుని భరతమాత పూజా దినోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ అధ్యక్షుడు సీహెచ్. మస్తానయ్య, సంస్కారభారతి కార్యవర్గం జ్యోతి ప్రకాశనం చేసి కార్యక్రమాల్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వందేమాతరం పూర్తి గీతం రాత, సంస్కృతం, హిందీ దేశ భక్తి గీతాల పోటీలు, కళాకృతులు తయారీ పోటీలలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభను చాటారు.

తాడేపల్లి ఎస్‌హెచ్‌ఓ బాధ్యతల స్వీకరణ

తాడేపల్లిరూరల్ : తాడేపల్లి పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వోగా ఎం.మధుసూదనరావు ఆదివారం సాయంత్రం బాధ్యతలు చేపట్టారు. తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఇప్పటి వరకు ఎస్‌హెచ్‌వోగా పనిచేసిన మల్లికార్జునరావు రేపల్లెకు బదిలీ అయ్యారు. వీఆర్‌లో ఉన్న మధుసూదనరావును తాడేపల్లి ఎస్‌హెచ్‌ఓగా నియమిస్తూ గుంటూరు రేంజ్ సౌత్ కోస్టల్ జోన్ ఐజీ పాలరాజు ఉత్తర్వులు జారీ చేయడంతో ఆయన ఇక్కడ బాధ్యతలు స్వీకరించారు.

నాయకుడిని కాదు..సేవకుడిని



ర్యాలీలో మాట్లాడుతున్న కిరణ్ కుమార్



అంబేడ్కర్ విగ్రహానికి నివాళి

- వైఎస్సార్ సీపీ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్
- కాకుమానులో వైఎస్సార్ సీపీ కార్యాలయం ప్రారంభం

కాకుమాను: 'నేను రాజకీయాల్లోకి వచ్చింది ప్రజా సేవ చేయడానికే. నేనెప్పుడూ ప్రజల మనిషినే. కార్యకర్తకు ఎలాంటి సమస్య వచ్చినా అరగంటలో మీ ముందుంటా.' అని ప్రత్తిపాడు వైఎస్సార్ సీపీ సమన్వయకర్త బలసాని కిరణ్ కుమార్ అన్నారు. కాకుమానులో ఆదివారం వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ నల్ల మోతు శివరామకృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ సీపీ నూతన కార్యాలయ ప్రారంభోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిరణ్ కుమార్ మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన, మైనార్టీ వర్గాల ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాజకీయాల్లోకి వచ్చానన్నారు. పేదల ఇబ్బందులు తనకు తెలుసనని, అలాంటి బాధలు తాను కూడా పడ్డానని చెప్పారు. ప్రతిపక్ష నాయకులు ప్రజలను మభ్యపెట్టాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. మోసపూరిత మాటలు నమ్మే స్థితిలో రాష్ట్ర ప్రజలు లేరనే విషయాన్ని చంద్రబాబు గ్రహించాలని హితవు పలికారు. దళితుల్లో పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా అని చంద్రబాబు అన్న మాటలు.. ప్రతి దళిత కుటుంబం గుర్తుంచుకుంటుందని తెలిపారు. దళిత ద్రోహి అయిన చంద్రబాబు, అండ్ కో-పార్టీలకు త్వరలో జరగనున్న ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు తగిన బుద్ధి చెబుతారని సమన్వయకర్త బలసాని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రధాన కూడలిలో ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం గ్రామంలో భారీ వాహన ర్యాలీ నిర్వహించారు. బాబా సాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూల మాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. సర్పంచ్ శివకుమారి, సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు రాఘవరెడ్డి, ఉపాధ్యక్షుడు దేవిరెడ్డి సాంబయ్య, పార్టీ మండల ఉపాధ్యక్షుడు పెదపూడి కపిల్, తియ్యగూర వెంకటరెడ్డి, గేరా పున్నారావు, వల్లూరి సుధాకర్, మెరిగల రవిబాబు, మెట్టు వెంకప్పారెడ్డి, పిల్లి మేరి, షేక్ సుభాని ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

అయోధ్య రామయ్యా.. అవిఘ్నమస్తు

తిక్కిరెడ్డిపాలెం (ప్రత్తిపాడు): అయోధ్యలో జరగనున్న బాల రాముని ప్రాణ ప్రతిష్ఠకు సమయం ఆసన్నమైన వేళ.. గ్రామాల్లో రామ నామస్మరణ మార్మోగిపోతోంది. భక్తజనం రామ జపంతో పులకించిపోతోంది. అయోధ్య రామయ్యా.. అవిఘ్నమస్తు.. అంటూ ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. నేరుగా అక్కడ జరిగే మహోత్తర ఘట్టంలో పాల్గొనలేని వారు.. పరోక్షంగా వారి వారి గ్రామాల నుంచే వేడుకల్లో పాలుపంచుకుంటున్నారు. మండల పరిధిలోని తిక్కిరెడ్డిపాలెంలో కొలువుదీరిన విఘ్నేశ్వరాలయంలో ఆదివారం శ్రీరామ నామ ఏకాహం (24 గంటల రామనామ సంకీర్తన) కార్యక్రమాన్ని వైభవంగా జరుపుతున్నారు. గ్రామానికి చెందినర మహిళలు పూర్తిగా ఉప వాస దీక్షను ఆచరించి ఆదివారం ఉదయం నుంచి సోమవారం అయోధ్యలో బాల రాముని ప్రాణ ప్రతిష్ఠ జరిగే వరకు నిర్విరామంగా రామ నామాన్ని జపించనున్నారు. అనంతరం పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించి ఏకాహాన్ని ముగించనున్నారు.

శ్రీరాముని జెండాలతో శోభాయాత్ర

మంచాల(చేబ్రోలు): అయోధ్యలో రామమందిర ప్రారంబోత్సవం సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల్లో భక్తులు ర్యాలీలు, ప్రదర్శనలు నిర్వహించారు. అయోధ్యలో శ్రీరాముల వారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా ఆదివారం మంచాల గ్రామంలో శోభా యాత్ర ఘనంగా జరిగింది. స్థానిక రామాలయం నుంచి ప్రారంభమైన యాత్ర ప్రధాన రహదారుల్లో సాగింది. భక్త బృందం శ్రీరాముని జెండాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. స్వామివారి చిత్ర పటాలతో పల్లకీని ఊరేగించారు. ప్రత్యేక వాహనంపై చిన్నారుల వేషధారణలు ఆకర్షించాయి. శ్రీరాముడు, సీతాదేవి, లక్ష్మణుడు, ఆంజనేయుడు, జాంబవంతుడు తదితర వేషదారణలతో శోభాయాత్ర జరిగింది. జై శ్రీరామ్ నామస్మరణ, శోభాయాత్రలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



మంచాల గ్రామంలో శోభ యాత్ర



తిక్కిరెడ్డిపాలెం విఘ్నేశ్వరాలయంలో రామనామ సంకీర్తన



బాల శ్రీరాముడు, సీతాదేవి, లక్ష్మణుడు, ఆంజనేయులు

ముగిసిన మండల స్థాయి 'ఆడుదాం ఆంధ్రా' ఆటలు



మునిపల్లె క్రికెట్ జట్టుతో ఎంపీపీ పద్మలీల, కమిషనర్

పొన్నూరు: క్రీడలపై యువతకు ఆసక్తి పెంచి, నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు నిర్వహిస్తోందని ఎంపీపీ భవనం పద్మలీల అన్నారు. పట్టణంలోని నిడుబ్రోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న మండల స్థాయి ఆటల పోటీలు ఆదివారం విజయవంతంగా ముగిశాయి. పురుషుల కబడ్డీలో పట్టణంలోని జయభారత్ నగర్, మహిళల విభాగంలో నందూరు గ్రామం క్రీడాకారిణులు విజేతలుగా నిలిచారు. ఖోఖోలో చింతలపూడి, వాలీబాల్‌లో మాచవరం, బాడ్మింటన్‌లో పొన్నూరు సాంబశివనగర్, క్రికెట్‌లో మునిపల్లె గ్రామానికి చెందిన పురుషుల, మహిళల జట్లు విజయం సాధించినట్లు ఎంపీడీవో ఎ. శ్రీనివాసరావు తెలిపారు. విజేతల ఎంపీపీ పద్మలీల, మున్సిపల్ కమిషనర్ నయీం అహ్మద్, సర్పంచులు, అధికారులు అభినందించారు. ఈ నెల 24 నుంచి నియోజకవర్గస్థాయిలో క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు కమిషనర్ తెలిపారు.

కేఎల్‌యూ విద్యార్థినికి గన్ ఫైరింగ్‌లో పురస్కారం



తాడేపల్లిరూరల్ : ఆంధ్రా బాలికల ఎన్‌సీసీ 10వ బెటాలియ్ ఎనిమిదవ సామూహిక వార్షిక శిక్షణా శిబిరంలో కేఎల్‌యూకు చెందిన విద్యార్థినులు పలు రకాల పురస్కారాలు సాధించినట్లు 10వ ఆంధ్ర ఎన్‌సీసీ బెటాలియన్ లెఫ్టినెంట్ పావని ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పావని మాట్లాడారు. తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ విశ్వ విద్యాలయంలో బీఏ ఎల్‌ఎల్‌బీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న జె.షణ్ముఖి గన్ ఫైరింగ్‌లో ద్వితీయ బహుమతి సాధించిందని తెలిపారు. షణ్ముఖి గన్ ఫైరింగ్‌తో పాటు నృత్య ప్రదర్శనలో బంగారు బహుమతి సాధించిందని వెల్లడించారు. పేరేచర్ల షార్ట్ రేంజ్‌లో నిర్వహించిన 0.22 గన్ ఫైరింగ్ విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలకు అత్యుత్తమ క్యాడెట్లను ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. పాటలు పాడడం, క్యాంప్ నిర్వహణ వంటి పలు రకాల సాంస్కృతిక పోటీలలో కేఎల్‌యూ విద్యార్థినులు నవ్య, కల్పన, మైత్రి పురస్కారాలను సాధించగా ప్రెట్టో రాథోర్ ఉత్తమ క్యాడెట్‌గా పురస్కారం అందుకున్నారని వివరించారు. క్యాంప్ కమాండెంట్ ఎస్‌వీఎస్ సుదర్శన్ చేతుల మీదుగా ఆయా విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిన క్యాడెట్లకు పురస్కారాలు అందజేశారని తెలిపారు. ఈ సందర్భంగా వర్శిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ సీహెచ్. హనుమంతరావు, లా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పవన్‌కుమార్‌లు పురస్కారాలు సాధించిన విద్యార్థినులను అభినందించారు.

పోరాట యోధుడు లెనిన్

ప్రత్తిపాడు: పోరాట యోధుడు కామ్రేడ్ వి.ఐ.లెనిన్ అని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్ అన్నారు. ప్రత్తిపాడులోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం లెనిన్ శత వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గ కార్యదర్శి రామిశెట్టి ఆదేశ్వరరావు ఆధ్వర్యంలో లెనిన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జంగాల మాట్లాడుతూ సోషలిస్టు రాజ్య స్థాపకుడు లెనిన్ అని తెలిపారు. ఆయన పోరాటాలు చిరస్మరణీయమన్నారు. ఈ కార్యక్రమంలో బందెల నాజర్, సీపీఐ మండల కార్యదర్శి ఎం.అంకమ్మరావు, పలు యూనియన్ల నాయకులు సిద్ది రవి, మేడా తాతారావు, నాగిరెడ్డి, ఎం.సాయికుమార్, వడ్డే భాస్కర్, సీపీ నేత వెంకటరావు పాల్గొన్నారు.



లెనిన్ చిత్రపటానికి అజయ్‌కుమార్ నివాళి

వేమన పద్యం తెలుగు వారి సొంతం

లక్ష్మీపురం: తెలుగు వారు గర్వించదగ్గ గొప్ప సామాజిక కవి వేమన అని సాహితీవేత్త ముప్పాళ్ల వి.ఎస్.ప్రసాద్ పేర్కొన్నారు. అరండల్‌పేటలోని అవగాహన ఆధ్వర్యంలో ప్రజాకవి వేమన జయంతిని ఆదివారం నిర్వహించారు. సాహితీవేత్తలు, కవులు ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముప్పాళ్ళ వి.ఎస్. ప్రసాదరావు మాట్లాడుతూ సమాజంలో మూఢనమ్మకాలు, విగ్రహారాధన, సామాజిక అంతరాలను వేమన ఖండించారన్నారు. రచయిత్రి ఏ.వి.కె. సుజాత మాట్లాడుతూ 19వ శతాబ్దం మొదటి భాగంలో బ్రిటిష్ అధికారి సి.పి.బ్రౌన్ వేమన పద్యాలు సేకరించి పుస్తక రూపంలో తెచ్చి, ఆయన గొప్పతనాన్ని ప్రపంచానికి తెలియజేశారన్నారు. కవి జమదగ్ని మాట్లాడుతూ మానవులంతా ఒకటే అన్న సత్యాన్ని వేమన చాటి చెప్పారని తెలిపారు. కార్యక్రమంలో రచయిత్రి పింగళి భాగ్యలక్ష్మి, విద్యావేత్త ఈ.చంద్రయ్య, కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ముప్పాళ్ల వి.ఎస్.ప్రసాద్

కోడి పందేల స్థావరంపై పోలీసుల దాడి

తాడికొండ: తాడికొండ మండలం బండారుపల్లి గ్రామంలో కోడి పందేల స్థావరంపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడులలో ముగ్గురు వ్యక్తులతో పాటు రూ.1050 నగదు, చనిపోయిన కోళ్లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచనున్నట్లు సీఐ ప్రభాకర్ తెలిపారు.

నేడు ఓటర్ల తుది జాబితా ప్రచురణ

సిద్ధం చేసిన యంత్రాంగం



ప్రత్తిపాడు తహసీల్దారు కార్యాలయంలో ఓటర్ల జాబితాలను సిద్ధం చేస్తున్న సిబ్బంది

ప్రత్తిపాడు: తుది ఓటర్ల జాబితా ప్రచురణకు రంగం సిద్ధమయ్యింది. ఈ నెల 22న ఫైనల్ జాబితాను ప్రచురించేందుకు యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ -2024 ప్రకారం ఇప్పటికే పోలింగ్ బూత్ లెవల్లో అనేక సార్లు స్పెషల్ క్యాంపులు నిర్వహించి, నూతన ఓటరుకు దరఖాస్తుతో పాటు మార్పులు, చేర్పులపై దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం గతేడాది అక్టోబరు 27న ముసాయిదా ఓటర్ల జాబితాను అధికారులు ప్రచురించారు. ముసాయిదా జాబితాను పోలింగ్ బూత్‌ల వద్ద, రెవెన్యూ కార్యాలయాల్లో పరిశీలన నిమిత్తం అందుబాటులో ఉంచారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నవంబరు మూడు, నాలుగు తేదీల్లో, డిసెంబరు నాలుగు, ఐదు తేదీల్లో పీఎస్‌ల వద్ద స్పెషల్ క్యాంపెయిన్‌లు చేపట్టి, అభ్యంతరాలు స్వీకరించారు. గత డిసెంబరు 26 వరకు అభ్యంతరాల ప్రక్రియను పూర్తి పారదర్శకంగా చేపట్టారు. అభ్యంతరాల దరఖాస్తులపై నియోజకవర్గ స్థాయిలో పలు దఫాలుగా అన్ని రాజకీయ పార్టీలతో ప్రత్యేక సమావేశాలు జరిపి, మార్పులు, చేర్పులతో పాటు తొలగింపులకు సంబంధించి అర్జీల వివరాలను, విచారణల సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఆయా పార్టీల నాయకులకు వివరిస్తూ పారదర్శకతకు పెద్దపీట వేశారు. ఈ నేపథ్యంలో నేడు తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నారు. ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకారం నియోజకవర్గంలోని ప్రత్తిపాడు, పెదనందిపాడు, కాకుమాను, వట్టిచెరుకూరు, గుంటూరు రూరల్ మండలాల్లో 2,58,973 మంది ఓటర్లు ఉండగా, వారిలో 1,21,553 మంది పురుషులు, 1,28,662 మంది మహిళలు, 32 మంది ఇతరులు ఉన్నారు. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. నేడు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి పి. శ్రీకర్ ఫైనల్ జాబితాను ప్రచురించనున్నారు. అనంతరం రాజకీయ పార్టీల నేతలకు జాబితాను అందించనున్నారు. ఇందుకు సంబంధించిన జాబితాను నియోజకవర్గ కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయంలో సిబ్బంది అంతా సిద్ధం చేశారు.

దివ్యాంగులకు ట్రై సైకిళ్లు అందజేత

బజరంగ్ ఫౌండేషన్ చేయూత

చేబ్రోలు: నిరుపేదలైన ఇద్దరు దివ్యాంగులకు బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ట్రై సైకిళ్లను ఆదివారం అందజేశారు. జగన్నామ సంక్షేమ సంగమం కార్యక్రమంలో భాగంగా ఇటీవల బజరంగ్ ఫౌండేషన్ నారాకోడూరు గ్రామంలో నేత్ర జ్యోతి, మీ గుండె పదిలం, దివ్యాంగ దర్శిని తదితర కార్యక్రమాలను నిర్వహించింది. గ్రామానికి చెందిన ఇద్దరు దివ్యాంగులు కూచిపూడి అబ్రహం, కారుమూరి సాల్మన్ నడవలేని స్థితిలో పడుతున్న ఇబ్బందులను అంబటి మురళీకృష్ణ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆయన రెండు ట్రై సైకిళ్లను వారి ఇంటి వద్దకు వెళ్లి అందజేశారు. ఒంటరివాడైన అబ్రహం దైనందిన కార్యక్రమాలకు సహాయం చేసే వారు లేకపోవటంతో వెస్టన్ కమోడ్‌ను ఆయన నివాస ప్రాంతంలో ఏర్పాటు చేయాలని ఫౌండేషన్ సభ్యులను అంబటి ఆదేశించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను స్ఫూర్తిగా తీసుకుని బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాల పరంపరను కొనసాగిస్తున్నట్లు అంబటి మురళీకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన సభ్యులు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.



దివ్యాంగులకు ట్రై సైకిళ్లు అందజేస్తున్న బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అంబటి మురళీకృష్ణ

పోలీసుల అదుపులో జూదరులు

పెదకాకాని: పేకాట స్థావరంపై నిర్వహించిన దాడుల్లో ఐదుగురు జూదరులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కొప్పురావూరు గ్రామ శివారులో పేకాట ఆడుతున్నట్లు ముందస్తు సమాచారం ఆదివారం ఐదుగురు పేకాట ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.18,570ల నగదు, మూడు బైక్‌లు, మూడు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఐదుగురు జూదరులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వినోద్ బాబు తెలిపారు.

గారపాడులో..

ప్రత్తిపాడు: కంది పొలంలో పేకాట ఆడుతున్న ఏడుగురు జూదరులను పోలీసులు అరెస్టు చేశారు. వివరాలిలా ఉన్నాయి.. వట్టిచెరుకూరు మండలం గారపాడులోని కంది పొలాల్లో ఆదివారం రహస్యంగా పేకాట ఆడుతున్నారన్న సమాచారం స్పెషల్ బ్రాంచి అధికారులకు అందింది. దీంతో ఆ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వట్టిచెరుకూరు పోలీసులు జూద స్థావరంపై దాడిచేశారు. పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోనికి తీసుకున్నారు. వారి నుంచి రూ. 21,340లు నగదుతో పాటు ఆరు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసి, కోర్టుకు హాజరు పరచనున్నట్లు పోలీసులు తెలిపారు.



పొన్నూరు ఎరుకులవాడలో..

పొన్నూరులో..

పొన్నూరు: పట్టణంలోని ఎరుకులవాడ సమీపంలోని పొలంలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై షేక్. హసీం తెలిపారు. వారి నుంచి రూ.3,800 నగదు సీజ్ చేసి, కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

అక్రమ మద్యం విక్రేతల అరెస్ట్

పెదకాకాని: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఉప్పలపాడు గ్రామంలో అక్రమంగా మద్యం అమ్ముతున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో గ్రామానికి చెందిన మేడా సాంబయ్య వద్ద నుంచి 35, నక్కా బాజి వద్ద 25 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు.

రజకుల సమస్యలపై పెద్దన్న అలుపెరుగని పోరాటం

నెహ్రూనగర్: రజకుల సమస్యలపై అలుపెరుగని పోరాటం చేసిన పోరాట యోధుడు సి. పెద్దన్న అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రజక జన సేవా సంఘం ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు పేర్కొన్నారు. రజక జన సేవా సంఘం మాజీ అధ్యక్షుడు పెద్దన్న సంతాప సభ ఆదివారం కాకుమానువారితోటలోని యానాదికాలనీలో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రానికి రెండుసార్లు అధ్యక్షుడిగా ఎన్నికైన పెద్దన్న రజకుల సమస్యలపై నిత్యం పోరాడేవారని గుర్తు చేశారు. ఆయన ఆలోచన విధానాలకు అనుగుణంగా రజక జాతి ముందుకు సాగాలని చెప్పారు. కార్యక్రమంలో బహుజన మహాసభ సెంట్రల్ కమిటీ కార్యదర్శి జీఆర్ భగత్ సింగ్, రైతు కూలీ సంఘం నాయకులు నాదెండ్ల బ్రహ్మయ్య, పి. కోటేశ్వరరావు, ఉల్లిగడ్డల నాగేశ్వరరావు, రవికుమార్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.



సంతాప సభలో మాట్లాడుతున్న జూపూడి శ్రీనివాసరావు

స్వచ్ఛ భారత్‌తో ఆలయం పరిశుభ్రం

తాడేపల్లిరూరల్ : దుగ్గిరాల మండల పరిధిలోని ఈమని గ్రామంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ దుగ్గిరాల మండల అధ్యక్షుడు దానబోయిన వెంకట శివాజీ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు స్వచ్ఛ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఈమని గ్రామంలో శ్రీ కోదండ రామాలయం దేవస్థాన పరిసర ప్రాంతాన్ని శుభ్రం చేసి ఆలయం చుట్టూ ఉన్న చెత్తను తొలగించామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చుండూరు ఉమా మహేశ్వర రావు, జిల్లా కార్యదర్శి ప్రశాంతి, పాల్గొన్నారు.